క్లుప్తంగా

శ్రీరామ నవమి ఉత్సవాలకు శుభరాట



శ్రీరామనవమి శుభరాట వేస్తున్న భక్తులు

కంచిలి: మండల కేంద్రంలో స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏటా నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు పూజా కమిటీ సిద్ధమైంది. ఇందుకోసం శుభరాటను మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో వేశారు. ఈ కార్యక్రమాన్ని పురోహితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై కేంద్ర మంత్రికి లేఖ

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ తేజస్వికి లేఖ రాశారు. సంబంధిత ప్రతులను స్థానిక విలేకర్లకు మంగళవారం అందజేశారు. వెనుకబడిన ప్రాంతంగా ముద్రపడిన సోంపేట స్టేషన్‌లో సౌకర్యాలను మెరుగు పర్చాలని కోరారు. ముఖ్యంగా ప్లాట్‌ఫాంల పైన కోచ్ ఇండికేషన్ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వీటిని మంజూరు చేసినప్పటికీ ఇంతవరకు ఏర్పాటు చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. లేఖలో ఢిల్లీరావుతోపాటు సభ్యులు బి.బాలక్రిష్ణ, టి. వెంకటరావు, బి.చిరంజీవిలు సంతకాలు చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న నాగేశ్వరరావు

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు గొర్లె నాగేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. యూఎస్‌కు చెందిన గాడ్ సన్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమి సంస్థ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హైదరాబాద్ కేంద్రంగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆ సంస్థ సాహిత్య రంగంలో పనిచేస్తున్న ఆయనకు గుర్తించి డాక్టరేట్‌తో గౌరవించింది.

మమ్మరంగా వాహన తనిఖీలు



కోళ్ల వ్యాన్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీని పోలీసులు ముమ్మరం చేశారు. జాతీయ రహదారి నుంచి టెక్కలికి వచ్చే మార్గాలతో పాటు టెక్కలి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. టెక్కలి ఏఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం అర్ధ రాత్రి స్థానిక జగతిమెట్ట జంక్షన్ వద్ద 20 మంది ఆర్‌పీఎస్‌ఎఫ్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, వ్యాన్లు తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు.

నేడు తీర ప్రాంత గ్రామాల్లో మంత్రి సీదిరి ఎన్నికల ప్రచారం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం, తీర ప్రాంత గ్రామాలైన అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, రిట్టపాడు, పల్లిసారధి, గంగాధరపల్లి గ్రామాల్లో పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గుర్యయ్యానాయుడు మంగళవారం తెలిపారు. ప్రచారంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వీల్‌చైర్ అందజేత



రాజేష్‌కు వీల్‌చైర్ అందించిన దృశ్యం

సోంపేట: బెంకిలి గ్రామానికి చెందిన బైరి రాజేష్ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కవిటి మండలానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు వీల్‌చైర్‌ను సమకూర్చారు. దీన్ని రాజేష్‌కు మంగళవారం అందజేసినట్టు సంస్థ ప్రతినిధి పత్రి షణ్ముఖరావు తెలిపారు.

ఊరూరా ఉగాది సందడి

తెలుగువారి సంప్రదాయ పండుగ ఉగాదిని మంగళవారం ఊరూరా జరుపుకున్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రారంభం సందర్భంగా పట్టణం, గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకుంది. తెల్లవారు జాము నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను ఉత్సవ కమిటీలు సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు, పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. రాశి ఫలాలను తెలుసుకోవడానికి చాలామంది ఆసక్తి చూపారు. రైతులు ఏరువాకను ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఉగాది సందర్భంగా పండితులను సత్కరించి గౌరవించారు. నాయకులు, అధికారులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి.



కవిటి చంద్రశేఖరాలయంలో పంచాంగ శ్రవణంలో ప్రజలు



ఇచ్ఛాపురం: జ్ఞానభారతి పాఠశాల ఆవరణలో కవి సమ్మేళనం



టెక్కలి: చిన్నారుల నృత్యాలు



టెక్కలి: కిటకిటలాడుతున్న బంగారు దుకాణం



వజ్రపుకొత్తూరు: హరిదాసుపురంలో పంచాంగ శ్రవణం



టెక్కలి: టెక్కలి రోటరీనగర్ బాల వికాస్ మందిరంలో చిన్నారుల పంచాంగ పఠనం



కంచిలి: పూజలందుకున్న కంచమ్మతల్లి అమ్మవారు



సోంపేట: జింకిభద్రంలో సాంస్కృతిక ప్రదర్శన



టెక్కలి: సాహిత్య సాంస్కృతిక సమాఖ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతుల ప్రదానం



ఇచ్ఛాపురం: పూజలందుకుంటున్న ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారు



ఇచ్ఛాపురం: బెల్లుపడ శివానందగిరి త్రినాథ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



కాశీబుగ్గ: పలాసలో నృత్యకళాకారులను సత్కరిస్తున్న జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు



కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో అనాథులకు అల్పాహారం అందిస్తున్న సత్యసాయి విద్యార్థులు

వాహనాలను నిశితంగా తనిఖీ చేయాలి



వాహనాల తనిఖీ పరిశీలిస్తున్న ఐ.ఎ.బేగం

కంచిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒడిశా సరిహద్దు నుంచి రవాణాకు ఉపయోగించే వాహనాలను నిశితంగా తనిఖీలు చేసి విడిచిపెట్టాలని పలాస అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఐ.ఎ.బేగం సిబ్బందికి సూచించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామమైన మండలంలోని ఘాటీ ముకుందాపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఈ సరిహద్దు గ్రామాల నుంచి డబ్బు, మద్యం, సారా, ఇతర మత్తు పదార్థాలు, ఓటర్లను లోబర్చుకొనేందుకు రకరకాల వస్తు సామగ్రిని తీసుకొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ వాహనంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఇక్కడ ప్రత్యేక బృందం తనిఖీలు చేపడుతన్న వైనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెతోపాటు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థిని ఓడించాలి



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థిని ఓడిస్తే ఆ పార్టీ జిల్లాలో భూస్థాపితం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మండలంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకమన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని కోరారు. స్వర్గీయ అట్టాడ జనార్దనరావు నాయుడు కృషితో ఏర్పాటైన నందిగాం మండలం నియోజకవర్గంలో ప్రత్యేకమైనదన్నారు. ఎన్నికల్లో ఈ మండలం నుంచి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు భారీ మెజారిటీ వచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. రైల్వే స్టేషన్లలో బెంచీలకే పరిమితమైన ఎంపీ రామ్మోహన్‌నాయుడును ఓడిస్తే జిల్లాలో తెలుగుదేశం పార్టీ భూస్థాపితం అవుతుందని.. కాబట్టి నాయకులు, కార్యకర్తలు ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జడ్యాడ జయరాం, స్థానిక ఉప సర్పంచ్ బెండి సన్యాసిరావు, నాయకులు కురమాన బాలక్రిష్ణారావు, కింతల ధర్మారావు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, సర్లాన బైరాగి, పద్ద బుల్లినాయుడు,కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, అక్కురాడ లోకనాథం, అట్టాడ శ్రీనివాసరావు , అట్టాడ ఠాగూర్ ఉన్నారు.

పలాస మున్సిపాలిటీలో ప్రచారం రేపు

కాశీబుగ్గ: పలాస అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ నెల 11వ తేదీన పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డులో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని వార్డు కౌన్సిలర్ శర్వాణి గీత మంగళవారం తెలిపారు.

15 నుంచి హాటకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

శ్రీకాకుళం రూరల్: బైరి సింగుపురంలోని హాటకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త, స్థానిక సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి కె.వెంకటరమణ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 15న చైత్ర శుద్ధ సప్తమి సందర్భంగా రాత్రి 8 గంటలకు ధ్వజారోహణం, 19న కొండమ్మ పిలుపు, 20న ఉదయం 9 గంటలు నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



కోటబొమ్మాళి: లఖందిడ్డిలో రాజీనామాపత్రాలతో వలంటీర్లు



ఎత్తురాళ్లపాడులో రాజీనామా పత్రాలను చూపిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: టీడీపీ, జనసేన పార్టీల నాయకుల అనుచిత వ్యాఖ్యలకు నిసరనగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మంగళవారం కూడా పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి సచివాలయం పరిధికి చెందిన పది మంది, ఎత్తురాళ్లపాడులో ఐదుగురు రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామ సచివాలయంలో పరిధిలో సేవలు అందిస్తున్న బైపల్లి గ్రామానికి చెందిన ఆరుగు గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.



వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న వలంటీర్లు

చలివేంద్రాలు ఏర్పాటు

టెక్కలి:

ఉగాది సందర్భంగా పట్టణంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒక వైపు భానుడు ప్రతాపంతో ఎండలు తీవ్రరూపం దాల్చుతుండడంతో, స్థానికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన త్రినాథ కార్పెంటర్స్ ఫర్నిచర్ నిర్వాహకుడు ధర్మవరపు పూర్ణాచారి ఆధ్వర్యంలో పట్టణంలో పలు ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కూడా చలివేంద్రాలను ప్రారంభించారు.



అంబేడ్కర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం



టెక్కలి పాతజాతీయ రహదారిలో చలివేంద్రం

గౌతు రాజకీయ కుట్రలు కరోనా కంటే ప్రమాదం

- మందస మండల ప్రచారంలో మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: గౌతు రాజకీయ కుట్రలు కరోనా వైరస్ కంటే ప్రమాదకరమని పలాస వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని అంబటికంబారం, టిక్కటపడ, పెద్దకోష్ఠ, చిన్నకోష్ఠ, బలరాంపురం, తాళ్లగురంటి, గొడగురంటి, కళింజినగర్, పెడంగో, బుడార్సింగి, బిరిబడియా, కృష్ణాపురం, పిల్లి బుడార్సింగి, కుశపద్ర, బొరంట, భోగాపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ప్రజల కోసం, నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని అన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పరిస్థితి చూస్తే ఆమె రాజకీయాలు, మాట తీరు కరోనా వైరస్ కంటే ప్రమాదకరంగా ఉన్నాయని అన్నారు. ఆమె తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మందస మండల ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యుడు సవర చంద్రమ్మ, పార్టీ మండల అధ్యక్షులు అగ్గున సూర్యం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సురేష్ పాణిగ్రాహి, ఎంపీటీసీ సభ్యులు ఎస్.లోకనాథం, అనితాలోకనాథం, సర్పంచ్ జోగిరావు, నాయకులు అందాల శేషగిరి, బృందావన్, రాపాక శేషగిరి పాల్గొన్నారు.



టెక్కలి చేరీవీధిలో దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారానికి హాజరైన జనం

అభివృద్ధికి చోటు ఇవ్వండి

సోంపేట: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో మరోసారి చోటు ఇవ్వాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ అభ్యర్థి పిరియా విజయ కోరారు. సోంపేట మేజర్ పంచాయతీలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోదతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. టీడీపీ నాయకుల మాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్‌లు తడక జోగారావు, నగిరి ప్రభావతి, తామాడా పద్మావతి, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, నీతివైశ్యరాజ్, నర్తు జానకీ, బొమ్మిడి ధర్మరాజు ఉన్నారు.

సంక్షేమ పాలనకే ఓటు వేద్దాం

టెక్కలి: సంక్షేమ ప్రభుత్వానికే ఓటు వేద్దామని టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కోరారు. టెక్కలిలోని చేరవీధి, దండుపాటివీధి, సోగ్గాడిపేట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కె.అజయ్, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్, సర్పంచ్ జి.సుజాత, ఎంపీటీసీ సభ్యులు పి.హేమలత, కె.పార్వతి, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు చింతాడ గణపతి, పీత రమణబాబు, పి.చంటి, టి.ఆదినారాయణరెడ్డి, బి.గోపాల్, ఆర్.కృష్ణారావు, బి.తులసీరావు, పి.వైకుంఠరావు, డి.పోలయ్య, ధవళ కృష్ణ పాల్గొన్నారు.



కాశీబుగ్గ: మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

వైఎస్సార్‌సీపీని ఆదరించండి

నందిగాం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో పట్టకట్టాలని శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి పేరాడ తిలక్ కోరారు. తిలక్ తన స్వగ్రామం కణితూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా తనకు, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు మెట్ట సంధ్య, నాయకులు శ్యామలరావు, పుచ్చకాయల పాపారావు, పేరాడ రమేష్, గిన్ని వెంకటేష్ పాల్గొన్నారు. దేవుపురంలో మాజీ ఎంపీపీ యర్ర చక్రవర్తి, పెద్దలవునిపల్లిలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, కాపు తెంబూరులో సర్పంచ్ పోలాకి మోహనరావు ప్రచారం చేశారు.



సోంపేట: ఎన్నికల ప్రచారం చేస్తున్న పిరియా విజయ



టెక్కలిలో ప్రచారం చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్



నందిగాం:దేవుపురంలో ప్రచారం



కాశీబుగ్గ: ఒడిశా సంప్రదాయంలో డాక్టర్ అప్పలరాజుకు అక్షింతలు వేసి ఉలాలు పోస్తున్న మహిళలు